సాక్షి
తూర్పుగోదావరి
సోమవారం । 19 । జూన్ । 2023



'నేను-నాది' అనే భావన వీడాలి

నేను-నాది అనే భావ దారిద్ర్యాలను విడిచిపెట్టినప్పుడే వ్యక్తులతో పాటు దేశం బాగు పడుతుందని ప్రవచనకర్త డాక్టర్ గరికిపాటి నరసింహారావు అన్నారు. - IIలో



గుర్ర్‌మరణాలు

వేగంగా గమ్యం చేరాలనే ఆతృత, అలసట, నిద్ర లేమి తదితర కారణాల వల్ల ఎక్కువగా తెల్లవారుజామునే ప్రమాదాలు జరుగుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. - IIలో

గరిష్టం/కనిష్టం
44.0° / 26.3°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	44.0	28.5
కాకినాడ	42.1	26.3
అమలాపురం	40.0	28.0

మెరిశారు.. మురిపించారు..

- జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చూపిన గోదారి కుర్రాళ్లు
- ఓపెన్ కేటగిరీలో పలువురికి ఉత్తమ ర్యాంకులు
- అందరిదీ సామాన్య నేపథ్యమే..

సాక్షి నెట్‌వర్క్: ఒకరిది వ్యవసాయ కుటుంబం.. మరొకరిది చిరు వ్యాపారంతో సాగే జీవనం.. ఇంకొకరి తల్లిదండ్రులు చిరుద్యోగులు.. ఇలా సామాన్య, మధ్య తరగతి నేపథ్యం నుంచి వచ్చిన గోదారి కుర్రాళ్లు జాతీయ స్థాయిలో అదరగొట్టారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)ల్లో ప్రవేశానికి కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రతిష్టాత్మక జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల ఓపెన్ కేటగిరీలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. తల్లిదండ్రుల ఆకాంక్షలను, తమ ఆశయాలను నెరవేర్చుకునే దిశగా పెద్ద అడుగు వేశారు. తమ బిడ్డలు సాధించిన విజయంపై వారి తల్లిదండ్రులు మురిసిపోతున్నారు. దేశంలోని వివిధ ఐఐటీల్లో వీరందరూ సీట్లు సాధించనున్నారు. నిర్దేశించుకున్న ఉత్తమ లక్ష్య సాధన కోసం అహరహం కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు చెప్పారు.



తల్లిదండ్రులతో దుగ్గిరాల యశస్వి (147వ ర్యాంకర్)



పేరు: దుగ్గిరాల యశస్వి
ర్యాంక్: 147
తల్లి: సుభాషిణి, గృహిణి
తండ్రి: సతీష్, తెలంగాణ జెన్‌కోలో అకౌంట్స్ ఆఫీసర్
ఊరు: పోచవరం, తాళ్లపూడి మండలం
లక్ష్యం: శాస్త్రవేత్త



పేరు: పయిడిపర్తి శ్రీసూర్య నాగ హద్విక్
ర్యాంక్: 164
తల్లి: లక్ష్మీకళ, గృహిణి
తండ్రి: వీర వెంకట సత్యనారాయణమూర్తి, టీచర్
ఊరు: కాట్రేనిపాడు, రాజోలు మండలం
లక్ష్యం: చెన్నై ఐఐటీలో కంప్యూటర్ సైన్స్



పేరు: గోకవరపు మణికంఠ శ్రీఅక్షిత్
ర్యాంక్: 259
తల్లి: గిరిజశ్రీ, గృహిణి
తండ్రి: శ్రీరామ్‌కుమార్, చిరు వ్యాపారి
ఊరు: అంబాజీపేట
లక్ష్యం: చెన్నై ఐఐటీ, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్



పేరు: కొళ్లకూరి సాయినాథ్ శ్రీమంత్
ర్యాంక్: 382
తల్లి: సత్యకుమారి, గృహిణి
తండ్రి: చిన సుబ్బారావు, ఎలక్ట్రికల్ వ్యాపారి
ఊరు: దుడ్డివారి అగ్రహారం, అమలాపురం
లక్ష్యం: చెన్నై ఐఐటీలో కంప్యూటర్ సైన్స్, ఇంజినీర్.



పేరు: గ్రంధి ఎస్‌జీఎస్ వర్షిత్
ర్యాంక్: 581
తల్లి: నాగకమల, గృహిణి
తండ్రి: రవిప్రకాష్, బిజినెస్
ఊరు: రాజమహేంద్రవరం
లక్ష్యం: సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు



విద్యార్థి పేరు: రామకుర్తి అశోకచంద్ర
ర్యాంక్: 603
తల్లి: అనంతలక్ష్మి, గృహిణి
తండ్రి: దొరబాబు, ఎస్సై, ఎస్ఈబీ
ఊరు: గొల్లప్రోలు. ప్రస్తుతం కాకినాడ
లక్ష్యం: కంప్యూటర్ సైన్స్, పరిశోధన రంగంలో కృషి



పేరు: గుత్తి వినయకుమార్
ర్యాంక్: 649
తల్లి: స్వాతి భ్రమరాంబ, గృహిణి
తండ్రి: సుబ్రహ్మణ్య స్వామి, వస్త్ర వ్యాపారం
ఊరు: సీతానగరం
లక్ష్యం: కంప్యూటర్ ఇంజినీర్



పేరు: కర్రి గంగా ధనశ్రీ
ర్యాంక్: 786
తల్లి: చంద్రలక్ష్మి, గృహిణి
తండ్రి: రామచంద్రారెడ్డి, బిజినెస్
ఊరు: పొలమూరు, అనపర్తి మండలం
లక్ష్యం: కంప్యూటర్ ఇంజినీర్



పేరు: పిసిని కౌసల్యాదేవి
ర్యాంక్: 943
తల్లి: సీతాదేవి, గృహిణి
తండ్రి : శ్రీనివాసరావు, ఫర్నిచర్ షాపులో గుమస్తా
ఊరు: అనంతపల్లి, నల్లజర్ల మండలం
లక్ష్యం: సీఈఓ కావడం



పేరు: పోలిశెట్టి గంగా మనోహర్
ర్యాంక్: 1,052
తల్లి: భూలక్ష్మి, ప్రభుత్వ టీచర్
తండ్రి: శ్రీనివాసరావు, ప్రభుత్వ టీచర్
ఊరు: మురమళ్ల, ఐ.పోలవరం మండలం
లక్ష్యం: చెన్నై ఐఐటీ, ఐఏఎస్



పేరు: పాటి సతీష్
ర్యాంక్: 1,137
తల్లి: సత్యవేణి, గృహిణి
తండ్రి: పల్లంశెట్టి, వ్యవసాయం
ఊరు: క్రాప, అయినవిల్లి మండలం
లక్ష్యం: ఐఐటీ, ఇంజినీర్



పేరు: కొమరపు వివేక్ వర్ధన్
ర్యాంక్: 1,197
తల్లి: ప్రసూన, ప్రైవేటు టీచర్
తండ్రి: గోపీ గోవర్ధన్: ప్రభుత్వ టీచర్
ఊరు: నల్లజర్ల
లక్ష్యం: ముంబై ఐఐటీ, కంప్యూటర్ ఇంజినీరింగ్



పేరు: పోలిశెట్టి ఎస్‌వీ మహేష్
ర్యాంక్: 1,209
తల్లి: వెంకటలక్ష్మి, గృహిణి
తండ్రి: సత్యనారాయణ, రైల్వే లోకో పైలట్
ఊరు: సంపర. ప్రస్తుతం రాజమహేంద్రవరం
లక్ష్యం: కంప్యూటర్ సైన్స్



పేరు: మద్దాల వీర వెంకట మోహన్
ర్యాంక్: 1,477
తల్లి: శ్రీలక్ష్మి, గృహిణి
తండ్రి: రామసత్యనారాయణ, బిజినెస్
ఊరు: కొత్తపేట
లక్ష్యం: కంప్యూటర్ సైన్స్



పేరు: అనపర్తి వెంకట సుబ్రహ్మణ్య మనోజ్
ర్యాంక్: 1,555
తల్లి: సత్యవతి, ఏపీ ఈపీడీసీఎల్ ఉద్యోగి
తండ్రి: ఉదయ్, పోస్టల్ ఉద్యోగి
ఊరు: సిరిపురం, ఏలేశ్వరం మండలం
లక్ష్యం: సాఫ్ట్‌వేర్ ఇంజినీర్



పేరు: రెడ్డి శివప్రజిత్
ర్యాంక్: 1,654
తల్లి: అమరావతి, గృహిణి
తండ్రి: రవికుమార్, వ్యవసాయం
ఊరు: వెలగతోడు, మండపేట మండలం
లక్ష్యం: కంప్యూటర్ ఇంజినీర్



పేరు: మాచిన మోహన పృథ్వీసాయి
ర్యాంక్: 1,858
తల్లి: గీత, గృహిణి
తండ్రి: శ్రీధర్, వ్యవసాయం
ఊరు: రంగంపేట
లక్ష్యం: కంప్యూటర్ ఇంజినీర్



పేరు: వెలగల ధీరజ్ సాత్విక్‌రెడ్డి
ర్యాంక్: 38
తల్లి: కల్యాణి, ప్రైవేటు టీచర్
తండ్రి: సూర్యభాస్కరరెడ్డి, ప్రభుత్వ హెచ్ఎం
ఊరు: పాలంగి, ఉండ్రాజవరం మండలం
లక్ష్యం: కంపెనీ సీఈఓ



పేరు: మల్లిడి మోహన కల్యాణి
ర్యాంక్: 137
తల్లి: విశాలాక్షి, గృహిణి
తండ్రి: సత్తిరెడ్డి, వ్యవసాయం
ఊరు: అనపర్తి
లక్ష్యం: కంప్యూటర్ సైన్స్ చదివి ఉన్నత స్థానం సాధించడం



పేరు: కంటిపూడి శ్రీఅశ్విన్
ర్యాంక్: 1,207
తల్లి: సరిత, గృహిణి
తండ్రి: కాశీ విశ్వనాథ్, వ్యవసాయం
ఊరు: రాజమహేంద్రవరం
లక్ష్యం: ఐఐటీ, బిజినెస్



పేరు: ధనేకుల జయప్రకాశ్
ర్యాంక్: 1,420
తల్లి: సుభాషిణి, గృహిణి
తండ్రి: బలరామయ్య, ఉపాధ్యాయుడు
ఊరు: సింగరాయకొండ
లక్ష్యం: ఐఏఎస్




పేరు: వి.భార్గవకృష్ణ
ర్యాంక్: 1,934
తల్లి: హైమావతి, గృహిణి
తండ్రి: వీరబ్రహ్మం, టీచర్
ఊరు: పులగుర్త, అనపర్తి మండలం
లక్ష్యం: ఐఐఎస్‌సీ చదివి, సైంటిస్టు కావడం.

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో నేడు ప్రత్యేక స్పందన

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డితో కలిసి సోమవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక స్పందన నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ కె.మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా మూడో సోమవారం ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకూ నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నామన్నారు. క్షేత్ర స్థాయిలో సంబంధిత డివిజన్, మండల కార్యాలయాలతో పాటు గ్రామ/వార్డు సచివాలయాల్లో కూడా సిబ్బంది ప్రజల నుంచి స్పందన అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ఇకపై మండల స్థాయి అధికారులందరూ సంబంధిత మండల కేంద్రంలో ఒకేచోట హాజరై స్పందన అర్జీలు స్వీకరిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

డెల్టాలకు 5,730 క్యూసెక్కులు



ధవళేశ్వరం: ఖరీఫ్ సాగుకు సంబంధించి కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 5,730 క్యూసెక్కుల నీటిని వదిలారు. తూర్పు డెల్టాకు 1,590, మధ్య డెల్టాకు 1,140, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 9.45 అడుగులకు చేరింది.

లోవకు భక్తుల తాకిడి



లోవ ప్రాంగణంలో చెట్ల కింద వంటలు, భోజనాలు చేస్తున్న భక్తులు

తుని రూరల్: మండుటెండలోనూ తరలి వచ్చిన భక్తులతో లోవ దేవస్థానం కిటకిటలాడింది. వివిధ జిల్లాల నుంచి ఆదివారం వచ్చిన 8 వేల మంది భక్తులు తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,48,070, పూజా టికెట్లకు రూ.92,280, కేశఖండన శాలకు రూ.11,700, వాహన పూజలకు రూ.7,440, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెల రూపేణా రూ.59,880, విరాళాలుగా రూ.80,785 కలిపి మొత్తం రూ.4,00,755 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు వివరించారు. భక్తుల కు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ గొర్లి అచ్చియ్య నాయుడు, ధర్మకర్తలు, శ్రీవారి సేవకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కొత్త జంట.. ఆషాఢం తంటా



- నేటి నుంచి ప్రారంభం
- ఈ నెల రోజులూ కొత్త జంటలు వేర్వేరుగా ఉండాల్సిందే
- అనాదిగా వస్తున్న ఆచారం

కొవ్వూరు: కొత్తగా పెళ్లయిన జంటలకు ఆషాఢం తంటా మొదలైంది. ఆదివారం ఉదయం వరకూ జ్యేష్ఠ అమావాస్య ఉంది. తరువాత ఆషాఢ మాసం మొదలైనట్టే. కానీ, సోమవారం ఉదయం సూర్యోదయ వేళకు మాత్రమే ఆషాఢ శుద్ధ పాడ్యమి ఉంటోంది. దీంతో శాస్త్రం ప్రకారం సోమవారం నుంచే ఆషాఢ మాసం ఆరంభమవుతోంది. ఈ ఏడాది కొత్తగా పెళ్లయిన దంపతులు ఈ మాసంలో వేర్వేరుగా ఉండాలనేది ఏళ్ల తరబడి వస్తున్న ఆచారం. ఈ నెల రోజులూ కొత్త పెళ్లి కూతురు పుట్టింట్లో ఉంటుంది. దీని వెనుక ఆచారంతో పాటు శాస్త్రీయ కారణాలున్నాయని పండితులు చెబుతున్నారు.
ప్రస్తుత గ్రీష్మ రుతువులో తొలకరి మొదలవుతుంది. ఈ సమయంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉంటాయి. కొత్తగా పెళ్లయిన యువకులు భార్య దగ్గరుంటే వ్యవసాయ పనులను నిర్లక్ష్యం చేస్తారనేది ఒక నమ్మకం. పైగా ఆషాఢ మాసంలో గర్భం దాల్చితే చైత్ర, వైశాఖ మాసాల్లో ప్రసవించే అవకాశం ఉంటుంది. అది మంచి ఎండలు కాసే సమయం. దీంతో ఆ తల్లీబిడ్డలు ఇబ్బందులు పడతారని పెద్దలు చెబుతూంటారు. అంతే కాకుండా చైత్ర మాసంలో పిల్లలు పొంగు, చికెన్‌పాక్స్ వంటి అంటు వ్యాధుల బారిన పడతారని పూర్వం భయం ఉండేది. ఈ కారణాలతోనే ఆషాఢ మాసంలో భార్యాభర్తలు వేర్వేరుగా ఉండాలనే ఆచారం అనాదిగా వస్తోందని పండితులు చెబుతున్నారు. పూర్వం అన్ని వర్గాల వారూ ఆషాఢ నియమాన్ని అనుసరించే వారని, కాలక్రమేణా ఇది హిందువులకే పరిమితమైందని అంటున్నారు.

అన్యోన్యతలు తెలుసుకునే అవకాశం

కొత్త పెళ్లి కూతుళ్లకు ఇంటి బెంగ (హోమ్ సిక్) తీర్చాలన్న సదుద్దేశం కూడా ఆషాఢ మాస నియమంతో ముడిపడి ఉందని పెద్దలు చెబుతున్నారు. పెళ్లి తర్వాత ఆ అమ్మాయి జీవితాంతం భర్తతోనే కలిసి ఉండాలి. కొత్తగా పెళ్లయిన అమ్మాయి నెల రోజుల పాటు పుట్టింట్లో ఉండటం వలన ఆ దంపతుల మధ్య అన్యోన్యత గురించి తల్లిదండ్రులు అడిగి తెలుసుకునే అవకాశం ఉంటుంది. కొత్తగా పెళ్లయిన తర్వాత నెల రోజుల పాటు ఇద్దరూ వేర్వేరుగా ఉండటం వలన వారి మధ్య ప్రేమానురాగాలు మరింత బలపడతాయని పెద్దలు విశ్వసించేవారు. ఆషాఢం అనంతరం అత్తవారి ఇంటికి వచ్చే అల్లుళ్లకు తమ ఆర్థిక స్తోమతను బట్టి నగదు లేదా వస్తు రూపంలో బహుమతి ఇవ్వడం ఆనవాయితీ. తద్వారా అత్తమామలు, అల్లుడి మధ్య కూడా ప్రేమానురాగాలు పెరుగుతాయని పెద్దలు నమ్ముతారు. కొత్తగా పెళ్లయిన ఆడపిల్ల పుట్టింటి నుంచి పెళ్లి కొడుకు ఇంటికి ఆషాఢంతో వివిధ రకాల వంటకాలతో సారె (కావిళ్లు) పంపిస్తారు. ఆషాఢం ముగిసిన తర్వాత అత్తవారింటి గుమ్మం వద్ద అల్లుడు కొబ్బరి కాయలు కొట్టిన తర్వాతే ఇంట్లోకి ప్రవేశిస్తారు. అల్లుడు అత్తవారింటికి వెళ్లే సమయంలో కూడా వివిధ రకాల స్వీట్లు, పెళ్లికూతురుకు చీర తీసుకువెళ్తారు. ఏళ్ల తరబడి ఈ సంప్రదాయం కొనసాగుతూ వస్తోంది.

పెళ్లిళ్లకు రెండు నెలలు విరామం

జూన్ 19 నుంచి జూలై 17వ తేదీ వరకూ ఆషాఢ మాసం. ఆ మరునాటి నుంచి ఆగస్టు 16వ తేదీ వరకూ అధిక శ్రావణ మాసం ఉంది. ఈ రెండు నెలలూ పెళ్లి ముహూర్తాలు ఉండవు. శంకుస్థాపనలు, గృహప్రవేశాల వంటి శుభ ముహూర్తాలు కూడా ఉండవు. శూన్య మాసంగా పరిగణించే ఆషాఢంలో ఎటువంటి శుభకార్యాలూ చేయరు. అధిక శ్రావణ మాసంలో కేవలం శీమంతాలు, బాలసారె, అక్షరాభ్యాసాలు, అన్నప్రాశన, నూతన వ్యాపారాల ప్రారంభం వంటి లఘు శుభకార్యాలు యథావిధిగా చేసుకోవచ్చని పండితులు చెబుతున్నారు. ఈ మాసంలో పెళ్లి చూపులు కూడా ఉండవు కానీ, పెళ్లి మాటలు మాట్లాడుకోవచ్చునని అంటున్నారు.

వేల మంది ఉపాధిపై ప్రభావం

శుభ ముహూర్తాలు లేకపోవడంతో ఈ రంగంపై ఆధారపడిన వేలాది మంది ఉపాధిపై రెండు నెలల పాటు ప్రభావం పడనుంది. పురోహితులు, క్యాటరింగ్, వంట మనుషులు, లైటింగ్, డెకరేషన్ కార్మికులు, కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లు, టిప్‌టాప్‌ల్లో పని చేసే కార్మికులు, బ్యాండు పార్టీలు, పూల దుకాణాలు, ట్రావెల్స్, పెళ్లి సామగ్రి విక్రయించే దుకాణాలు, కిరాణా, వస్త్ర, జ్యూయలరీ వ్యాపారాలు, ఎంటర్‌టైన్‌మెంటు టీముల్లో పని చేసే వారికి ఉపాధి కాస్త తగ్గుతుంది.

ఆచారం పాటించాలి



ఏ కొత్త జంటయినా పూర్వం నుంచీ వస్తున్న ఆషాఢ మాసం ఆచారాన్ని కచ్చితంగా పాటించాలి. హనీమూన్ పేరుతో విహార యాత్రలకు వెళ్లడం, బంధువుల ఇళ్లల్లో భార్యాభర్తలు కలుసుకోవడం చేస్తున్నారు. ఇది సంప్రదాయాలకు విరుద్ధం. ఎన్నో సైంటిఫిక్ కారణాలు, ఆచార సంప్రదాయాలను పరిగణనలోకి తీసుకుని ఆషాఢ మాస నియమం అమలు చేస్తున్నారు. దీనిని భావితరాలకు అందించాలి. ఎంత టెక్నాలజీ అందుకున్నా ఆచార, సంప్రదాయాలను గౌరవించడం మంచిది.

– వారణాసి హనుమంతశర్మ, రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ పురోహిత సంఘం, కొవ్వూరు, తూర్పు గోదావరి జిల్లా

అమ్మ సంబరాలకు.. అంతా సిద్ధం

- నేటి నుంచి తలుపులమ్మ అమ్మవారి ఆషాఢ మాసోత్సవాలు
- పర్వదినాల్లో ప్రత్యేక పూజలు, విశేషాలంకరణలు

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి ఆషాఢ మాసోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల 17వ తేదీ వరకూ జరిగే ఈ ఉత్సవాలకు నాలుగైదు లక్షల మంది భక్తులు తరలి వచ్చే అవకాశముంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వారికి మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు దేవస్థానం అధికారులు, పాలక మండలి సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా వివిధ పర్వదినాల్లో అమ్మవారికి విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. గంధామావాస్యకు లోవ కొత్తూరులో 12 రోజులు, ఆషాఢంలో లోవ ప్రాంగణంలో తలుపులమ్మ వారికి నెల రోజులు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఏడాదికోసారి వచ్చే ఈ ఉత్సవాల కోసం సమీప గ్రామాలకు చెందిన వంటలు, ఇతర పనివారు, ప్రైవేటు వ్యాపారులు, ప్రైవేటు కాటేజీల వారు, వసతి గదుల నిర్వాహకులు గంపెడు ఆశతో ఎదురు చూస్తున్నారు. కరోనా విపత్తుతో 2020, 2021 సంవత్సరాల్లో ఆషాఢ మాసోత్సవాలు జరగలేదు. గత ఏడాది పరిస్థితులు అనుకూలించడంతో ఉత్సవాలు నిర్వహించారు. ఈ సంవత్సరం కూడా ఈ ఉత్సవాలు జరుగుతూండటంతో వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలి రానున్నారు.

బాలాలయంలోనే..

స్వయంభువుగా వెలసిన అమ్మవారి ప్రధాన ఆలయ పునర్నిర్మాణం జరుగుతోంది. అందువలన ఈ ఆషాఢ మాసోత్సవాల్లో తలుపులమ్మ అమ్మవారిని బాలాలయంలోనే భక్తులు దర్శించుకోవాల్సి ఉంటుంది. ఇందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. గత జనవరి నుంచి ప్రధాన గర్భాలయంలో అమ్మవారి దర్శనాలు నిలిపివేశారు. గత నెల 31న అమ్మవారి మూర్తిని పునఃప్రతిష్ఠ చేసినప్పటికీ ఆలయ నిర్మాణం పూర్తి కాకపోవడంతో భక్తులను దర్శనాలకు అనుమతించలేదు.

విశేష కార్యక్రమాలు

ఆషాఢ మాసోత్సవాల సందర్భంగా ఈ నెల 25న వివిధ రంగుల మట్టి గాజులతో అమ్మవారికి విశేష అలంకరణ చేస్తారు. 29న అమ్మవారి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా 108 కలశాల పంచామృతాలతో అభిషేకాలు, తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని లక్ష తులసి పూజ నిర్వహించనున్నారు. జూలై 2న వివిధ రకాల పూలతో ప్రత్యేక అలంకరణ చేస్తారు. మూడో తేదీన పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి ప్రీతికరమైన మహాచండీ హోమం, పూర్ణాహుతి నిర్వహిస్తారు. తొమ్మిదో తేదీ ఆదివారం వివిధ రకాల కూరగాయలతో శాకంబరీ దేవిగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. 13న మతత్రయ ఏకాదశి సందర్భంగా అమ్మవారికి విశేష పుష్పాలంకరణ, లక్ష బిల్వార్చన నిర్వహిస్తారు. 16వ తేదీ సాయంత్రం ఘటాభిషేకానికి ఆవాహన కార్యక్రమాన్ని వేద పండితులు నిర్వహిస్తారు. 17వ తేదీ ఉదయం 9.30 గంటల నుంచి సప్తనదీ జలాలతో అమ్మవారికి ఘటాభిషేకం నిర్వహిస్తారు.

చురుకుగా ఏర్పాట్లు

ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. దేవస్థానం ఆధ్వర్యాన వందకు పైగా వసతి గదులు, కాటేజీలు, పొంగలి షెడ్లు ఉన్నాయి. ఇటీవల రూ.కోటితో చేపట్టిన పనులు పూర్తవడంతో అదనంగా ఏసీ కాటేజీలు, ఉచిత షెడ్లు భక్తులకు అందుబాటులోకి వచ్చాయి. తాగునీరు, శానిటేషన్, అత్యవసర వైద్య సేవలు, పోలీస్ బందోబస్తు ఏర్పాట్లపై ధర్మకర్తల మండలి చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు ప్రత్యేక దృష్టి సారించారు. కొండ దిగువన ప్రైవేటు యజమానులు కూడా వసతి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే వందలాది తాటాకు పాకలు పునర్నిర్మించారు. కొత్త షెడ్లు సైతం నిర్మించారు. మరికొంతమంది ఇంకా నిర్మిస్తున్నారు.



లోవ దేవస్థానంలో ఇటీవల నిర్మించిన ఏసీ కాటేజీలు



రూ.21 లక్షలతో ఆధునీకరించిన మొదటి ఘాట్ రోడ్డు



నిర్మాణంలో ఉన్న రెండో ఘాట్ రోడ్డు



బాలాలయంలో లోవ తలుపులమ్మ అమ్మవారు

మెరుగైన సదుపాయాలు కల్పిస్తాం



ఆషాఢంలో తలుపులమ్మ తల్లిని దర్శించేందుకు వచ్చే భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తాం. తాగునీటి కొరత, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాం. మొదటి ఘాట్ రోడ్డును రూ.21 లక్షలతో ఆధునీకరించాం. రెండో ఘాట్ రోడ్డు నిర్మాణం జరుగుతోంది. పర్వదినాల్లో నిర్వహించే విశేష పూజలు, అలంకరణలకు ఏర్పాట్లు చేశాం.

– పెన్మెత్స విశ్వనాథరాజు, ఈఓ, లోవ దేవస్థానం

క్లుప్తంగా

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

రామచంద్రపురం రూరల్: ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ద్రాక్షారామ ఏఎస్సై ఎస్.దుర్గాభాయి ఆదివారం విలేకరులకు తెలిపారు. మండలంలోని వెల్ల గ్రామానికి చెందిన తోట వీరబాబు(40) రామచంద్రపురం కూరగాయల మార్కెట్‌లో వ్యాపారం చేస్తుంటాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో మనస్తాపానికి గురై ఈ నెల 17వ తేదీ మధ్యాహ్నం పురుగు మందు తాగాడు. అతనిని చికిత్స కోసం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు పంపించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై దుర్గాభాయి తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు

బిక్కవోలు: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.బుజ్జిబాబు ఆదివారం తెలిపారు. మండలంలోని కాపవరం గ్రామానికి చెందిన సత్యంశెట్టి దుర్గారాణికి 2016లో సత్యంశెట్టి అర్జున్‌తో వివాహం అయింది. కట్నంగా రూ.4 లక్షలు ఇచ్చారు. తరచు తాగి వచ్చి అదనపు కట్నం కోసం దుర్గారాణిని వేధిస్తున్నాడు. ఈ నెల 17వ తేదీన భార్యను అర్జున్ కొట్టడంతో ఆమెకు గాయాలు అయ్యాయి. వెంటనే అనపర్తి సీహెచ్‌సీకి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


అజయ్‌కుమార్ మృతదేహం

పెరవలి: నిడదవోలు–నరసాపురం ఆర్‌అండ్‌బీ రహదారిలో పెరవలి మండలం ఉసులుమర్రు వద్ద జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పెరవలి ఎస్సై ఎం.సూర్యభగవాన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తణుకు గ్రామానికి చెందిన నేలపాటి అజయ్‌కుమార్ (32) ఆదివారం ఉదయం పెరవలి నుంచి నిడదవోలు వైపు మోటార్ సైకిల్‌పై వెళుతుండగా ఉసులుమర్రు వద్ద విద్యుత్ స్తంభాన్ని తొలగించి పొక్లెయిన్‌తో వేరే చోటికి తరలిస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. పొక్లెయిన్ విద్యుత్ స్తంభాన్ని పట్టుకుని వేగంగా వెళుతుండగా అదే సమయంలో మోటార్ సైకిల్‌పై వస్తున్న అజయ్ కుమార్‌కు విద్యుత్ స్తంభం తలకు తగలటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పొక్లెయిన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్ర్ మరణాలు

- తెల్లవారుజామునే తెల్లారిపోతున్న బతుకులు
- అలసట, నిద్రలేమి వల్ల రోడ్డు ప్రమాదాలు
- భారీ ప్రమాదాలన్నీ వేకువ జామునే
- జాతీయ రహదారిపై 12 ఏళ్లలో 150 వరకూ దుర్ఘటనలు
- పదుల సంఖ్యలో మృత్యువాత, వందలాది మంది క్షతగాత్రులు


జొన్నాడలోని ఏటిగట్టు జంక్షన్ వద్ద కాలువలో బోల్తా పడిన లారీ (ఫైల్)


జొన్నాడ బస్టాండ్ సెంటర్ సమీపంలో జరిగిన ప్రమాదంలో మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

ఆలమూరు: వేగంగా గమ్యం చేరాలనే ఆతృత, అలసట, నిద్రలేమి తదితర కారణాల వల్ల ఎక్కువగా తెల్లవారుజామునే ప్రమాదాలు సంభవిస్తున్నాయే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆహ్లాదకర చల్లని వాతావరణంలో ప్రయాణం సులభంగా సాగుతుందనే అభిప్రాయంతో అనేకమంది వాహనదారులు తెల్లవారుజామున రాకపోకలు సాగిస్తుంటారు. అంతర్రాష్ట్ర సర్వీసులు నడిపే కొందరు లారీ డ్రైవర్లు పగలు కొంత సమయం విశ్రాంతి తీసుకుని రాత్రి వేళల్లో ప్రయాణం చేస్తుంటారు. ఈ వాహనాలు నడిపే డ్రైవర్లకు ఎక్కువగా తెల్లవారు జామునే కునికి పాట్లు వచ్చి డ్రైవింగ్ అదుపు తప్పుతోంది. మితిమీరిన వేగంతో పాటు నిద్రలేమి అనేక ప్రమాదాలకు కారణమవుతోంది. గడచిన 12 ఏళ్లలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గోపాలపురం నుంచి తుని వరకూ అత్యధిక భారీ ప్రమాదాలు అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామునే జరగడం గమనార్హం. 1967 ఏప్రిల్ 20న అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి, మంత్రి కళా వెంకట్రావు చేతుల మీదుగా ఆలమూరు–రావులపాలెం, సిద్ధాంతం–గోపాలపురం వంతెనలు ప్రారంభోత్సవం జరుపుకోవడంతో అప్పటి నుంచి ఐదవ నంబరు జాతీయ రహదారిగా ప్రాచుర్యం పొందింది. 2003లో అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో స్వర్ణ చతుర్భుజి విస్తరణలో భాగంగా 2003లో గౌతమీ, వశిష్ట నదులకు అదనంగా రెండు వంతెనలు ఏర్పాటు చేసి ఈ రహదారికి 16 నంబరు కేటాయించారు. మళ్లీ దివాన్ చెరువు నుంచి నల్లజర్ల మీదుగా ఏలూరుకు అభివృద్ధి చేసిన రహదారికి 16 నంబరు కేటాయించగా రావులపాలెం మీదుగా ఉన్న రహదారికి 216ఏ నంబరును కేటాయించారు.

- 2001 జనవరి నుంచి 2023 జూన్ వరకూ సుమారు 150 ప్రమాదాలు జరగ్గా అందులో జరిగిన 11 భారీ ప్రమాదాల్లో అధిక సంఖ్యలో మృతుల సంఖ్య నమోదైంది. వందలాది మంది క్షతగాత్రులు కాగా అనేక మంది అవయవాలు కోల్పోయారు.
- 2001లో గౌతమీ పాత వంతెన రైయిలింగ్‌ను వ్యాన్ ఢీకొన్న ఘటనలో గోదావరిలో పడి 10 మంది ప్రయాణికులు గల్లంతయ్యారు.
- 2009 డిసెంబర్ ఒకటో తేదీ తెల్లవారు జామున నల్లగొండ జిల్లా దామనచర్ల నుంచి సిమెంటు లోడుతో వస్తున్న లారీ పాత వంతెనపై నుంచి రెయిలింగ్‌ను ఢీకొని నదిలో పడిన ఘటనలో ఇద్దరి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి.
- 2011 జనవరి 11న పశ్చిమగోదావరి జిల్లా గౌరీపట్నంకు చెందిన లారీ గోదావరిలోని ఇసుక తిన్నెలపై పడి ముగ్గురు మత్యువాత పడ్డారు.
- విశాఖ జిల్లా ఏజెన్సీ ప్రాంతమైన ముంచింగిపుట్టుకు చెందిన సుమారు 40 మంది కూలీలు ఒంగోలులో తమ కూలి పనులు ముగించుకుని సిమెంట్ లారీపై 2012 జూలై 18న స్వగ్రామం వెళుతుండగా ఏటిగట్టు జంక్షన్‌లోని పంట కాలువలోకి దూసుకు వెళ్లి ప్రమాదానికి గురైంది. సిమెంట్ లారీ కింద పడి ఆరుగురు మృతి చెందగా 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి.
- 2016 ఫిబ్రవరి 29న ఇసుక లారీ కాలువలో పడిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా ఒకరు మృతి చెందారు.
- 2016 ఏప్రిల్ 16న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం విస్సాకోడేరుకు చెందిన 11 మంది పెళ్లి బృందం ఇన్నోవా కారులో పుణ్యక్షేత్రమైన అన్నవరం వెళుతుండగా అదే ప్రదేశంలో కాలువలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు చిన్నారులతో సహా ఒక వ్యక్తి మృతి చెందగా వధూవరులతో పాటు మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి.
- 2019 నవంబర్ నాలుగున చెన్నై నుంచి హండ్యాయ్ కార్ల లోడుతో వెళుతున్న కంటైనర్ ప్రమాదవశాత్తు అదుపు తప్పి కాలువలోకి దూసుకుపోయిన ఘటనలో డ్రైవర్, క్లీనర్ ఇద్దరూ మృతిచెందారు.
- 2020 అక్టోబర్ తొమ్మిదిన ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారం నుంచి వ్యవసాయ పనుల కోసం బైక్‌పై వెళుతున్న ముగ్గురు యువకులను ఐషర్ వేన్ ఢీకొన్న ఘటనలో ముగ్గురూ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు.
- 2023 జూన్ 12న 16 నంబరు జాతీయ రహదారిలోని నల్లజర్ల వద్ద ఆగి ఉన్న లారీని కారు ఢీకొన్న ఘటనలో ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందారు. దివాన్‌చెరువు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత పడగా పలువురు క్షతగాత్రులయ్యారు.
- 2023 ఏప్రిల్ ఏడున మూలస్థాన అగ్రహారంలో గుర్తు తెలియని వాహనం కారును ఢీకొన్న ఘటనలో ఆలమూరుకు చెందిన ఒకరు మృతి చెందగా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.
- 2023 జూన్ 17న టాటా ఏస్ వాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొన్న ఘటనలో అనకాపల్లి జిల్లా చోడవరం మండలంలోని ముద్దుర్తి గ్రామానికి చెందిన నలుగురు, పాలకొల్లుకు చెందిన ఒకరితో కలిపి మొత్తం ఐదురుగు మృత్యువాత పడగా ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి.

స్వీయ రక్షణ చర్యలు తప్పనిసరి



జాతీయ రహదారుల్లో ప్రయాణం చేసేటప్పుడు స్వీయ రక్షణ, జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారులు తప్పనిసరిగా కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవాలి. ప్రతి 15 కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన సైడ్ బార్‌లను డ్రైవర్లు సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి టోల్‌గేట్ వద్ద వాహనదారులకు విశ్రాంతి గదులు, ఇతర సదుపాయాలను కల్పిస్తున్నాం. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఉన్న జాతీయ రహదారుల్లో అత్యధికంగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి ప్రభుత్వానికి నివేదికను అందించనున్నాం. – డి.అశోక్ ప్రతాప్‌రావు, ఆర్‌టీఓ, అమలాపురం

నాటక పోటీల విజయవంతానికి పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న దయానందబాబు తదితరులు

కాకినాడ కల్చరల్: అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో జులై 6 నుంచి 9వ తేదీ వరకు స్థానిక సూర్యకళా మందిర్‌లోజరగనున్న 23వ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు విజయవంతం చేయాలని పరిషత్ వ్యవస్థాపక కార్యదర్శి పంపన దయానందబాబు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శాస్త్రి కళాపీఠంలో పరిషత్ అధ్యక్షుడు కర్రి అచ్యుత రామారెడ్డి అధ్యక్షతన ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. కళాకారులను ప్రోత్సహించేందుకు నాటిక పోటీలు నిర్వహిస్తున్నామని రామారెడ్డి తెలిపారు. సమావేశంలో సీఎస్ మూర్తి, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వైద్య,ఆరోగ్యశాఖలో బదిలీలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వైద్య, ఆరోగ్య శాఖ జోన్ 2 తూర్పుగోదావరి, కాకినాడ, ఏఎస్‌ఆర్, కోనసీమ, భీమవరం, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల పరిధిలో బదిలీలు చేపట్టనున్నట్లు ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ పద్మ శశిధర్ ఆదివారం తెలిపారు. ఈ నెల 19న హెల్త్ ఎడ్యుకేటర్స్, పీహెచ్ఎన్ (ఎన్‌టీ), 20 ఉదయం స్టాఫ్ నర్స్, మధ్యాహ్నం నుంచి ఫార్మాసిస్ట్ గ్రేడ్ 2, సీనియర్ అసిస్టెంట్, ఉదయం 21న హెడ్ నర్స్, ఎంపీహెచ్ఎస్ ఫిమేల్, మధ్యాహ్నం నుంచి ఎంపీహెచ్ఎస్ మేల్, 22 ఉదయం ఎంపీహెచ్ఈవో, మధ్యాహ్నం నుంచి ఏఎస్‌వో, డీఎస్‌వో, ఆఫీస్ సూపరింటెండెంట్స్, పారామెడికల్ ఆప్తామిక్ ఆఫీసర్స్, ఫార్మసీ సూపర్ వైజర్లకు బదిలీలు నిర్వహించనున్నామన్నారు.

మద్యం మత్తులో వృద్ధునిపై దాడి

చికిత్స పొందుతూ మృతి

మామిడికుదురు: మద్యం మత్తులో చేసిన దాడిలో వృద్ధుడు ప్రాణాలు కోల్పోయిన ఘటన మొగలికుదురులో జరిగింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడి కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ అదే గ్రామానికి చెందిన దొంతంశెట్టి బులిబాబు (68) ఆదివారం మృతి చెందాడు. ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎన్‌హెచ్‌లో జేఈగా పని చేస్తున్న గొల్లపూడికి చెందిన పసుపుల మణికంఠయాదవ్ గతంలో బులిబాబు ఇంట్లో అద్దెకు ఉండేవాడు. జే ఈ ప్రవర్తన సక్రమంగా లేకపోవడం, మద్యం సేవించి ఇంటికి రావడంతో అతడిని ఇల్లు ఖాళీ చేయించారు. అప్పటి నుంచి యాదవ్ అదే గ్రామంలోని వేరే ఇంటిలో అద్దెకుంటున్నాడు. శనివారం యాదవ్ మద్యం సేవించి బులిబాబు ఇంటికి వచ్చి అతని పెద్ద కుమారుడితో గొడవ పడ్డాడు. ఈ గొడవ విని ఇంట్లో నుంచి వచ్చిన బులిరాజును యాదవ్ బలంగా నెట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే బులిబాబును అమలాపురం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కాకినాడ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బులిరాజు మృతి చెందాడు. ఆ సమయంలో నిందితుడు మద్యం సేవించి ఉన్నాడని, మృతుని కుమారుడు నరేంద్ర వీరవినాయకబాబు ఫిర్యాదు మేరకు నిందితుడిపై హత్య కేసు నమోదు చేశామన్నారు.


కొనసాగిన వరుణ జపాలు


ఆలయ ప్రాంగణంలో ఋష్యశృంగుని విగ్రహంతో ఊరేగింపు నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని కోరుకుంటూ రత్నగిరి వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో పండితులు నిర్వహిస్తున్న వరుణ జపాలు రెండో రోజు ఆదివారం కూడా కొనసాగాయి. ఉదయం 7–30 గంటలకు దర్బారు మంటపంలో స్వామివారి ఉత్సవమూర్తుల వద్ద పండితులు ఋష్యశృంగ మహర్షి విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం ఋష్యశృంగమహర్షి విగ్రహంతో ఆలయ ప్రాకారంలో మూడుసార్లు ప్రదక్షిణ నిర్వహిస్తూ వరుణుని ఆహ్వానిస్తూ మంత్రాలు పఠించారు. అనంతరం దర్బారు మంటపంలో సుబ్రహ్మణ్య ఆవాహన, వారుణాక వాక మంత్ర పఠనం, వరుణ జపాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. అనంతరం స్వామి, అమ్మవార్లకు, ఋష్యశృంగమహర్షికి నీరాజనమంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వేద పండితులు గొల్లపల్లి ఘనాపాఠీ, యనమంద్ర శర్మ, గంగాధరబట్ల గంగబాబు, చిట్టి శివ, ముష్టి పురుషోత్తమ్, ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, వేంకటేశ్వర్లు, అర్చకులు దత్తాత్రేయశర్మ, సుధీర్, కంచిభట్ల రామ్‌కుమార్, వ్రత పురోహిత సంఘం అధ్యక్షుడు రవిశర్మ పాల్గొన్నారు. ఏఈఓ డీవీఎస్ కృష్ణారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ నెల 21వ తేదీ వరకు వరుణ జపాలు కొనసాగనున్నాయి.

'నేను–నాది' అనే భావన వీడాలి


ప్రవచనకర్త గరికిపాటి

కాకినాడ కల్చరల్: నేను–నాది అనే భావ దరిద్ర్యాలను విడిచిపెట్టినప్పుడే వ్యక్తులతోపాటు దేశం బాగు పడుతుందని పద్మశ్రీ పురస్కార గ్రహీత, ప్రవచనకర్త డాక్టర్ గరికిపాటి నరసింహారావు అన్నారు. స్థానిక సూర్యకళామందిర్‌లో సరస్వతీగాన సభ ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న నలదమయంతి చరిత్రపై గరికిపాటి ప్రవచనాలు ఆదివారంతో ముగిశాయి. నలదమయంతుల కథను ఆదర్శంగా తీసుకొని జీవిత పయనంలో ఎన్ని కష్టాలు ఎదురైనా ధైర్యంతో నిలవాలని అన్నారు. నలుడు అడవిలో దమయంతిని విడిచి వెళ్లిన తర్వాత ఆమె పడిన కష్టాలను వివరించారు. సుందర రూపుడయిన నలుడు అడవిలో పాముకాటుకు గురై నల్లగా మారిపోవడం, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నలుడు, బాహుకుడనే పేరుతో ఋతుపర్ణ మహారాజు వద్ద వంటవానిగా చేరిన ఘట్టాలను వివరించారు. కష్టాలలో కూడా తనకు ఉన్న అవకాశాన్ని ఏవిధంగా సద్వినియోగం చేసుకోవాలో నలుడి వ్యక్తిత్వం తెలుపుతోందని వివరించారు. చివరకు ఇంద్రుని దయంతో నలుడు పూర్వ రూపం పొంది తన రాజ్యాన్ని దక్కించుకొన్న ఘట్టాలను వివరించారు. ధైర్యంగా బతకాలి, సంతోషంగా మరణించాలని అన్నారు. అహంకారం, మమకారం రెండు ప్రమాదాలే అన్నారు. కష్టం వచ్చిందంటే వెనుక సుఖం వస్తోందని సూచన అని వివరించారు. జీవితంలో కష్టాలు పెరిగాయి అంటే అర్థం సుఖాలు రానున్నాయని భావించాలి తప్ప జీవితం ముగిసిపోయిందని అధైర్య పడరాదన్నారు. అలాగే ఎండలు మండిపోతున్నాయంటే వర్షాలు బాగా పడతాయని సూచన అని మండుతున్న ఎండలపై చమత్కరించారు. అనంతరం సరస్వతీ గాన సభ సభ్యులు నరసింహారావును ఘనంగా సత్కరించారు. గాన సభ అధ్యక్షుడు కేవీఎస్ ఆంజనేయమూర్తి, కార్యదర్శి పేపకాయల రామకృష్ణ, ఉపాధ్యక్షులు ఎల్.సత్యనారాయణ్, నారాయణ్ మురళి, మునుగంటి వెంకట్రావు, శ్రీరామచందరమూర్తి, ఎస్‌కేవీడీ వెంకట్రావు, పెద్దాడ సూర్యకుమారి, చావలి సూర్యకుమారి పాల్గొన్నారు.

శశి విజయ దుందుభి


వేలివెన్ను శశి క్యాంపస్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో వైస్ ఛైర్మన్ బూరుగుపల్లి లక్ష్మి సుప్రియ

ఉండ్రాజవరం: జేఈఈ అడ్వాన్స్‌డ్–2023 ఫలితాలలో శశి వేలివెన్ను విద్యార్థులు వివిధ ఆలిండియా కేటగిరీలలో అత్యుత్తమ ర్యాంకులతో మరోసారి తమ సత్తా చాటారని ఆ విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ ఆదివారం తెలిపారు. పి.జయచరణ్ ఆలిండియా 151వ ర్యాంకు, పి.మోహిత్‌సాయి సత్య ఆలిండియా 391వ ర్యాంకు, డి.నితిన్ ఆలిండియా 443వ ర్యాంకు, ఎం.ఉమామహేశ్వరరావు ఆలిండియా 474వ ర్యాంకు, జి.విశ్వతేజ ఆలిండియా 567వ ర్యాంకు, వి.యశ్వంత్‌నాయక్ ఆలిండియా 609వ ర్యాంకు, ఏవీఎస్ లక్ష్మి రాజేశ్వరి ఆలిండియా 648వ ర్యాంకు, డీఈఎస్.ఆదర్శ వర్మ ఆలిండియా 697వ ర్యాంకు, సీహెచ్ వెంకటసాయి ఆలిండియా 720వ ర్యాంకు, పి.హర్షవర్ధన్‌కుమార్ ఆలిండియా 750వ ర్యాంకు, ఎం.హర్షవర్ధిని ఆలిండియా 800వ ర్యాంకు, ఎస్.నరసింహ సమీర్‌కుమార్ ఆలిండియా 912వ ర్యాంకు, డీబీ అక్షయ్ ఆలిండియా 925వ ర్యాంకులతో పాటు 500 లోపు ర్యాంకులు నలుగురు, 1,000 లోపు ర్యాంకులు 13 మంది, 2,500లోపు ర్యాంకులు 41 మంది, 5,000 లోపు ర్యాంకులు 69 మంది సాధించారని ఆయన తెలిపారు. ఈ ఉత్తమ ఫలితాల సాధనకు కృషిచేసిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని శశి విద్యాసంస్థల వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మి సుప్రియ అభినందించారు.

కొనసాగిన ఆదిత్య హవా


ఆర్.అశోక్‌చంద్ర (51వ ర్యాంకు)


కె.తేజస్విని (250వ ర్యాంకు)


ఎం.రష్మిక (321వ ర్యాంకు)


సీహెచ్ జెబ్రియల్ మార్క్స్ (351వ ర్యాంకు)

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆదిత్య తన హవా కొనసాగించింది. ఆదివారం విడుదలైన ఫలితాల్లో జాతీయ స్థాయిలో పలు ర్యాంకులు సాధించిందని ఆదిత్య కళాశాలల సెక్రటరీ ఎన్ కృష్ణదీపక్‌రెడ్డి తెలిపారు. వివిధ కేటగిరిల్లో ఆర్.అశోక్‌చంద్ర 51, కె.తేజస్విని 250, ఎం.రష్మిక 321, సీహెచ్ జెబ్రియల్ మార్క్స్ 351, కె.వినయ్ 381, ఎల్.నిఖిత 384, బి.ఈశ్వర నవీన్ తేజ 433, బి.షణ్ముక్ ప్రీతమ్ 713, వై.రత్నసాయి ఆకాంక్ష 721, ఆర్. రాహుల్ 733, దాసరి సాయి తేజ 820, చాగలమర్రి గౌతమ్ 828, నేలపాటి సంజన 935, ఎ.లక్ష్మీ సిద్ధు 989వ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. ఆలిండియాలో అన్ని కేటగిరిల్లో వెయ్యి లోపు 14, రెండువేల లోపు 45, ఐదువేల లోపు 103 మంది ఆదిత్య విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. అధ్యాపకులను ఆయన అభినందించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శ్రీ షిర్డీసాయి ప్రతిభ


అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో చైర్మన్ శ్రీధర్, అధ్యాపక బృందం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలలో రాజమండ్రి శ్రీ షిర్డీసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు వివిధ కేటగిరిలలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీ విద్య ఆదివారం తెలిపారు. తమ లక్ష్యా ఐఐటీ అకాడమీలో శిక్షణ పొందిన టి.గణేష్ కుమార్ జాతీయ స్థాయి 16వ ర్యాంకు సాధించారన్నారు. బీజేఎల్ సాయికిరణ్ 158వ ర్యాంక్ కైవసం చేసుకోగా అంజనీ సుత ఆదిత్య 187వ ర్యాంకు, డి.జయప్రకాష్ 242, భరత్ నందా 316, సీహెచ్ మాన్విత 368, కె.రాజీవ్ శ్రీ సాయి 448వ ర్యాంక్ సాధించారన్నారు. మొత్తం ఏడుగురు విద్యార్థులు 500లోపు ర్యాంకులు సాధించగా, 10 మంది 1,000 లోపు ర్యాంకులు, 20 మంది 2,000 లోపు, 32 మంది 5,000 లోపు, 45 మంది 10,000 లోపు ర్యాంకులు సాధించారన్నారు. ఈ విజయం పట్ల శ్రీ షిర్డి సాయి విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ హర్షం వ్యక్తం చేస్తూ అడ్వాన్స్‌డ్‌కు హాజరైన మొత్తం 72 మందిలో 54 మంది దేశంలోని అత్యుతమ ఐఐటీల్లో సీట్లు సాధించగలరన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. విజేతలైన విద్యార్థులను, అందుకు కృషిచేసిన అధ్యాపక బృందాన్ని చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, లక్ష్యా అకాడమీ డీన్ చంద్రశేఖర్ అభినందించారు.

సత్తా చాటిన తిరుమల విద్యార్థులు


అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్: కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రతిష్ఠాత్మక జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో రాజమహేంద్రవరంలోని తమ తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమి విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. వివిధ కేటగిరిలలో జాతీయస్థాయిలో కె.వివేక్‌వర్ధన్ 17వ ర్యాంకును, డి.శివరామ్ 55, జీడీపీఎస్ఎస్.శరణ్ 60, కె.గంగాధనశ్రీ 74, డి.యువన్‌గేట్స్ 79, ఎం.రాహుల్ 100, జి.వినయ్‌కుమార్ 103, కె.శ్రీఅశ్విన్ 107, ఎస్.వందనశహానీ 117, కె.సందీప్ 137, ఎంవివి.మోహన్ 139, ఎం.మోహన్‌పృథ్వీసాయి 176, ఎల్.డొలాష్‌వర్ధన్ 193, పి.నితీష్‌కుమార్ 208, పి.శ్రీజ 233, సీహెచ్.రాజీవ్‌లోచన్ 234, కె.శ్రీదుర్గాశివగణేష్ 262, కె.గుణశేఖర్‌సుబ్బారావు 266, ఎ.రామ్‌హనీష్ 272, వి.శ్రీసాయితేజశ్విని 277, వి.భార్గవకృష్ణ 333, జి.సుదీంద్రదత్త 422, ఎం.చాణక్యఅపరాజిత్ 424, ఎం.చరణ్‌శ్రీతేజ 434, ఎస్.సుష్మ 434, పి.సునీత 448, ఎం.వినయ్‌వర్మ 450వ ర్యాంకును సాధించారన్నారు. 500లోపు 28మంది, 1,000లోపు 48మంది, 2,000లోపు 98మంది, 5,000లోపు 196మంది, 10,000లోపు 268మంది, 20,000లోపు 279మంది ర్యాంకులు సాధించారని ఆయన తెలిపారు. మొత్తం 242మంది విద్యార్థులు కోచింగ్ తీసుకోగా 232 మంది విద్యార్థులు సాధించి 95.9 శాతం సక్సెస్ రేటును పొందారని, సుమారు 165 మంది విద్యార్థులు ఐఐటీలలో సీటు సంపాదించగలరన్నారు. అత్యుత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను నున్న తిరుమలరావు, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి అభినందించారు.

గోవుల తరలింపును అడ్డుకున్న పోలీసులు

కొత్తపల్లి: మండలంలోని కొండెవరం శివారు పీబీసీ కాలువగట్టు సమీపంలో పిఠాపురం ఇంద్రానగర్‌కు చెందిన అరుగుల నాగేశ్వరరావు, కాకడ సమర్పణరావు గోవులను కబేళాలకు తరలించేందుకు సిద్ధం చేశారని సమాచారం రావడంతో ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. 26 గోవులను స్వాధీనం చేసుకుని కాకినాడ రమణయ్యపేటలో గోసంరక్షణ కేంద్రానికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. సమర్పణరావును అరెస్టు చేయగా నాగేశ్వరరావు పరారీలో ఉన్నట్లు ఎస్సై రామలింగేశ్వరరావు తెలిపారు.

గోదావరిలో దూకి ఆటోడ్రైవర్ ఆత్మహత్యాయత్నం

రక్షించిన రోడ్డు సేఫ్టీ పోలీసులు


ఆటోడ్రైవర్ రాజేంద్రప్రసాద్

కొవ్వూరు: కోరుకొండ మండలం బూరుగుపూడికి చెందిన బాదంపూడి రాజేంద్రప్రసాద్ అనే ఆటో డ్రైవర్ భార్యతో గొడవ పడి తన ఆటోలో వచ్చి ఆదివారం గామన్ ఇండియా బ్రిడ్జిపై నుంచి గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అదే సమయంలో అటువైపు వెళ్లే హైవే మొబైల్ రోడ్డు సేఫ్టీ టీము–12 వాహనంలో ఉన్న పోలీసులు గుర్తించారు. బ్రిడ్జిపై 28 నంబర్ స్తంభం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు దిగువన నదిలో ఉన్న జాలర్లను అప్రమత్తం చేశారు. తాళ్ల సాయంతో కిందికి దిగి రాజేంద్రప్రసాద్‌ను రక్షించారు. జాలర్ల పడవలోకి ఎక్కించారు. అక్కడి నుంచి ఒడ్డుకి చేర్చి పట్టణ పోలీసు స్టేషన్‌కి తరలించారు. ఆటోను పోలీసు స్టేషన్‌కి తరలించారు. రాజేంద్రప్రసాద్ భార్య మరియమ్మకు సమాచారం అందించారు. రాజేంద్రప్రసాద్‌ను పట్టణ పోలీసులు వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బోటులో సిలిండర్ పేలి మత్స్యకారుడి మృతి

కాకినాడ క్రైం: బోటులో సిలిండర్ పేలిన ఘటనలో ఓ మత్స్యకారుడు ప్రాణాలు కోల్పోయాడు. కాకినాడ ఎర్రరోడ్డు చర్చి వీధికి చెందిన చెక్కా సత్తిబాబు ఆదివారం ఉదయం మరో ఇద్దరితో కలిసి బోటులో చేపల వేటకు బయల్దేరి వెళ్లాడు. సత్తిబాబు మధ్యాహ్నం భోజనం సిద్ధం చేసేందుకు గ్యాస్ సిలిండర్ వెలిగించాడు. ఆపై స్టౌపై కళాయి పెట్టి నూనె వేసే సరికి ఎండ వేడిమికి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో ఆ సెగల ధాటికి సత్తిబాబు వెనక్కి కుప్పకూలిపోయాడు. ప్రమాద ఘటనను గుర్తించిన బోటు డ్రైవరు మంటలను అదుపు చేసి కాకినాడ తీరానికి తీసుకొచ్చాడు. అచేతనంగా పడి ఉన్న సత్తిబాబును కాకినాడ జీజీహెచ్‌లో చేర్చాడు. వైద్యులు పరీక్షించి అప్పటికే సత్తిబాబు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఒక్కసారిగా మంటలు ఎగసి పడడంతో షాక్‌కు గురై గుండె స్పందన స్తంభించిందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై ఆదివారం రాత్రి సత్తిబాబు భార్య జ్యోతి కాకినాడ పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.



సాధించాల్సిన లక్షణం ఐకమత్యం

ఐకమత్యంతో ఉండడం, మానవులు కలిసికట్టుగా కార్యోన్ముఖులు అవడం, మనుషుల్లో సమానత్వం అనేవి ప్రస్తుత పరిస్థితిలో మన సంఘానికి, దేశానికి, ప్రపంచానికి ఎంతో అవసరం. నిజానికి ఇవి ప్రస్తుతానికి మాత్రమే కాదు, ఎప్పటికీ తప్పకుండా అవసరం అయినవే. వర్తమానంలోలాగానే గతంలోనూ ఇవి నిజాయితీగానూ, నిజంగానూ మనలో చోటుచేసుకోలేదు. అందుకే మన వర్తమానం ఉండాల్సినంత ఫలవంతంగానూ, విజయవంతంగానూ లేదు. ఈ క్షేత్రవాస్తవాన్ని తెలుసుకుని మనం వీటిని ఆవాహన చేసుకోవాలి.

వేద వాఙ్మయంలోని సూక్తాల్లో సంవనన సూక్తం ఒకటి. ఇది ఋగ్వేదానికి చెందినదిగా చెప్పబడింది. కలిసికట్టుగా ఉండడం, కార్యోన్ముఖత్వం, సమానత్వం వీటిని ఉద్దేశిస్తూ, ఉవాచిస్తూ, ఉద్బోధిస్తూ సనాతన సాహిత్యం ఈ సంవనన సూక్తం ద్వారా విశ్వమానవాళికి యుక్తమైన చింతనను అందజేస్తోంది. ఇకనైనా మనం ముందుకు వచ్చి దాన్ని అనుసరించాల్సి ఉంది.

'సంసమిద్యువసే వృషన్నగ్నే విశ్వాన్యర్య ఆ' అంటూ మంచిని కురిపించే దైవమైన అగ్నీ! విశ్వమంతా ఐకమత్యంతో ఉండేట్టు చెయ్యి అని ఐకమత్యం ఆవశ్యకతను గుర్తెరిగి సంవనన సూక్తం ప్రార్థన చేసింది. ఈ విశ్వంలోని మానవులకు లుప్తం కాకుండా కావాల్సింది ఏమిటి? అది ఐకమత్యం కాకపోతే ఇంకేమిటి?? మనం ఆ ఐకమత్యాన్ని ఆకాంక్షించి సాధించాలి.

ఐకమత్యం తరువాత విశ్వమానవుల్ని కలిసికట్టుగా కార్యోన్ముఖులు అవండి, కలిసికట్టుగా మాట్లాడండి, మీ మనసుల్లో కలిసిపోయిన ఒకే అవగాహన నెలకొనాలి; మొదట్లో దేవతోపాసనలో ఏవిధంగా భాగమయ్యారో అలా కలిసికట్టుగా ఉండండి అని సూచిస్తూ 'సంగచ్ఛధ్వం సం వదధ్వం సం వో మానాంసి జానతామ్ దేవా భాగం యథా పూర్వే సంజానానా ఉపాసతే' అని తెలియజెప్పింది సంవనన సూక్తం.

ఐకమత్యం, కలిసికట్టుగా పనిచెయ్యడం తరువాత మానవుల్లో ఉండాల్సింది సమానత్వం. అందుకే

సమానో మన్త్రః సమితిః సమానీ సమానం మనః సహ చిత్తమేషామ్ సమానం మన్త్రమభి మన్త్రయే వః సమానేన వో హవిషా జుహోమి' అంటూ

మంత్రం అందరికీ సమానం, సభలు సమానత్వంతో ఉండాలి. మీ ఆలోచనలూ, చిత్తమూ సమానంగా ఉండాలి, మీ కోసం సమానంగా మంత్రాన్ని అభిమంత్రిస్తాం, మీ కోసం సమానంగా ఆహుతుల్తో ఆరాధిస్తాం అని సంవనన సూక్తం ద్రష్టలు గట్టిగా చాటారు.

అంటరానితనమో, భేద చింతనో వేదంలోనూ, సనాతన సాహిత్యంలోనూ లేదు అన్న సత్యాన్ని ఈ మాటల ద్వారా సరిగ్గా అర్థం చేసుకున్నాక, చక్కగా ఆకళింపు చేసుకున్నాక 'సమానీ వ ఆకూతిః సమానా హృదయాని వః సమానమస్తు వో మనో యథా వః సుసహాసతి' అంటూ మీ తలపులు లేదా సంకల్పాలు ఒకటే అయి ఉండాలి, మీ హృదయాల భావాలు ఒకటే అయి ఉండాలి, మీ ఆలోచనలు ఒక్కటై ఉండనీ. ఇలా మీలో మంచితనం బలం నెలకొనాలి అని సంవనన సూక్తం చేసిన దిశానిర్దేశాన్ని మనం అవగతం చేసుకోవాలి; అటుపై ఆచరణలోకి ఆహ్వానించి దాన్ని అములులో నిలపాలి.

> ఆలోచనలు ఒకటైతే బలం అన్న సార్వజనీనమైన, సార్వకాలికమైన, సకల శ్రేయస్కరమైన చింతనను మనం మస్తిష్కాల్లో సమ్మిళితం చేసుకోవాలి ; మన అస్తిత్వానికి ప్రశాంతతను సమకూర్చుకుని సుఖంగానూ, సంతోషంగానూ జీవించాలి.

ఒక కుటుంబంలోని, ఒక సమాజంలోని, ఒక దేశంలోని, ఒక ప్రపంచంలోని మనుషుల్లో ఐకమత్యం, కలిసికట్టుతనం, సమానత్వం ఈ మూడూ లేకపోవడంవల్ల జరుగుతున్న హానికి ప్రతి మనిషీ గురి అవుతున్నాడు; కలుగుతున్న నష్టానికి ప్రతి మనిషీ బలి అవుతున్నాడు. ఎప్పుడో కాదు ఇప్పటికి ఇప్పుడు ముమ్మాటికి ఆ మూడిటిని మనకు మనం అన్వయించుకోవాలి; ఉన్న, రానున్న ముప్పుల్ని లేకుండా చేసుకోవాలి. మునుపటి ప్రమాదాలకు ముగింపు పలికి ఐకమత్యం, కలిసికట్టుతనం, సమానత్వం వీటితో ప్రమోదంగా మనం మునుముందుకు సాగుతూ ఉండాలి.

– రోచిష్మాన్


సన్నిధి

సాక్షి ఫ్యామిలీ IV

రాజమహేంద్రవరం
సోమవారం ॥ 19-6-2023

గురువాణి

నీ ఆకలి, నీ నిద్ర నీదే కదా... మరి..!!!




నీవు ఎదగలేకుండా పోవడానికి కారణం ఎవరు ? నీకు సలహాలిచ్చేవారికోసం, నీకు సహాయపడేవారి కోసం చూస్తున్నావా? నీకు బంధువులు లేరా? వాళ్ళు నిన్ను పట్టించుకోవడంలేదా? నీకు స్నేహితులు, శ్రేయోభిలాషులెవరూ లేరా? వారు నీకు మార్గదర్శనం చేయడం లేదా? లేక... నీకు శత్రువులు ఎక్కువగా ఉన్నారా? వాళ్లు నిన్ను ముందుకు పోనీయడం లేదా? అంటే ఎవరో రావాలనీ, వాళ్ళు నిన్ను జాగ్రత్తగా నడిపించాలనీ, నీ ప్రతి కష్టంలో వారు నీకు తోడుగా నిలబడి దిశానిర్దేశం చేయాలని నీవు కోరుకుంటున్నావని అర్థం... దీనికి జగద్గురువయిన కృష్ణ పరమాత్మ ఏమంటున్నాడో చూడండి...

''ఉద్ధరేద్ ఆత్మనాత్మానమ్ నాత్మానమ్ అవసాదయేత్, ఆత్మైవ హై ఆత్మనో బంధుర్ ఆత్మైవ రిపుర్ ఆత్మనః''

– అంటే నీకు నీవే బంధువువు, నీకు నీవే స్నేహితుడివి, నీకు నీవే శత్రువివి. నీకు ఆకలివేస్తే నీవే తినాలి, నీకు నిద్రవస్తే నీవే నిద్ర పోవాలి, నీకు దాహం వేస్తే నీవే నీళ్లు తాగాలి...అలాగే నీకు కష్టం వచ్చినప్పుడు, నీకు సమస్యలు ఎదురయినప్పుడు ఎవరో వస్తారని, నిన్ను కటాక్షిస్తారని, నిన్ను ఉద్ధరిస్తారని ఎదురు చూస్తూ కూచోవద్దు. బంధువులు, స్నేహితులు, శత్రువులు బయట లేరు... నీలోనే ఉన్నారు. నీవు వారిని గుర్తిస్తే... నీకు ఇక ఏ చింతా ఉండదు. నీ నిద్ర నీవు పోయినట్లుగానే, నీ ఆకలి నీవు తీర్చుకున్నట్లుగానే... నీ కష్టాన్ని కూడా నీవే తీర్చుకుంటావు.

భగవంతుడు మనకు కొన్ని అద్భుతమయినవి ఇచ్చాడు. భువనం.. ఈ ప్రపంచాన్ని ఇచ్చాడు. నీ జీవితం వర్ధిల్లడానికి ప్రకృతిని ఇచ్చాడు. నీకు ఆహ్లాదమయినవి చూసి సంతోషించడానికి కళ్ళు ఇచ్చాడు.. నీకు ఇష్టమయినవి వినడానికి చెవులిచ్చాడు. తాకి అనుభూతి చెందడానికి చర్మానికి స్పర్శనిచ్చాడు. వాసనలు చూడడానికి ముక్కు ఇచ్చాడు... ఇలా చాలా ఇచ్చాడు... ఇవన్నీ నీకోసం, నీవు అనుభవించడానికే ఇచ్చాడు... అయితే ఇవన్నీ ధర్మచట్రంలో ఇమిడేటట్టు చూసుకోమన్నాడు... అంతే.. అదే చేసెయ్... ఇవన్నీ వదిలేసి మనసు పక్కచూపులు చూస్తున్నదనీ, ఎటో లాగుతున్నదనీ విచ్చలవిడిగా పోతే ... నీలో ఉన్న శత్రువును... నీవే ఉత్సాహపరిస్తే... నీ పతనానికి నీవే దారి ఏర్పాటు చేసుకుంటున్నట్లు అవుతుంది.

పిల్లలను కూర్చోబెట్టుకుని వారికి మంచీ చెడూ ఎలా చెబుతుంటావో... నీ మనసుకు కూడా ప్రతిరోజూ, ప్రతి క్షణం అలా చెబుతూ ఉండు... అప్పుడది నీకు ఆత్మబంధువుగా మారుతుంది. నీ శ్రేయస్సు కోరే నీ స్నేహితుడిగా, నీ శ్రేయోభిలాషిగా నీకు మార్గదర్శనం చేస్తుంది. నీ కంటికి కనురెప్ప ఉంది. అది నీ కంటిని ఎలా కాపాడుతుంటుందో నీ మనసును అనుక్షణం నీవు అలా కాపాడుతుండాలి. అదే నిన్ను నీవు ఉద్ధరించుకోవడం– అని పరమాత్మ గీతాబోధ చేసాడు. ఇంత కన్నా చెప్పడానికి ఎవరికయినా ఏముంటుంది.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

తాత్త్వికథ

భాషా మాధుర్యం



ఆయన ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు. ఢిల్లీలో స్థిరపడాల్సి వచ్చింది. ఖాళీగా ఉండటం దేనికని ఇంటి గేటుకు 'తెలుగు నేర్పించబడును' అని బోర్డు పెట్టించాడు.

'ఇక్కడెవరు తెలుగు నేర్చుకుంటారు? మీకు పిచ్చి కాకపోతేను...' అని కుటుంబ సభ్యులు ఆట పట్టించినా పట్టించుకోలేదు. ఆరు నెలలు గడిచినా ఎవ్వరూ రాలేదు. అయినా ఆయన నిరాశ చెందలేదు. ఎప్పుడో ఒక రోజు ఎవరో ఒకరు వస్తారని, తెలుగు నేర్చుకుంటారని ఆశగా ఉండేవాడు.

ఆయన అనుకున్నట్టుగానే ఒక రోజు సాయంత్రం పడవలాంటి కారు ఇంటి ముందర వచ్చి నిలుచుంది. అందులో నుంచి, మంచి పేరున్న ఓ వృద్ధ హిందీ రచయిత దిగాడు. తెలుగు నేర్పమని కోరాడు. అందుకు సంతోషంగా సమ్మతిస్తూ ఎప్పుడెప్పుడు రావాలో, ఏయే పుస్తకాలు తెచ్చుకోవాలో...' లాంటివి చెప్పాడు తెలుగు పండితుడు.

అలాగేనని చెప్పి బయలుదేరుతున్న రచయితతో ''ఈ వయసులో మీకు తెలుగు నేర్చుకోవాలని ఎందుకు అనిపించింది?'' అని అడిగాడు.

''నేను ఈ మధ్యనే దక్షిణాది తీర్థయాత్రకు వెళ్ళాను. యాత్రలో భాగంగా తిరుమలకొండ కూడా వెళ్ళాను. అక్కడ వెంకటేశ్వర స్వామిని కీర్తిస్తూ రాసిన తాళ్ళపాక అన్నమయ్య సంకీర్తనలు విన్నాను. గుండె లోలోతు పొరల్ని తాకాయి ఆ కీర్తనలు. తెలుగు భాష నేర్చుకుంటే అన్నమయ్య రచనల్ని మరింత లోతుగా పరిశీలించవచ్చని భావించాను. అందుకే మీ దగ్గర తెలుగు నేర్చుకోవాలనుకున్నాను'' అని బదులిచ్చాడు.

రచయిత మాటలు విన్న విశ్రాంత ఉపాధ్యాయుడి కళ్ళు తడి అయ్యాయి.

'అయ్యో... తెలుగువాడినై ఉండి నేను ఇప్పటివరకు అన్నమాచార్య కీర్తనలను ఆస్వాదించలేకపోయానే...' అని బాధ పడ్డాడు.

ఒకపక్క ఆ రచయితకు తెలుగు పాఠాలు చెబుతూనే అన్నమయ్య గ్రంథాలను చదవడం, వినడం ప్రారంభించాడు. అన్నమయ్య కీర్తనల్లోని మాధుర్యాన్ని ఆస్వాదించసాగాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

సినిమా

గ్రీన్‌సిగ్నల్ ఇస్తారా?


రవితేజ

రవితేజ యమా స్పీడ్‌గా సినిమాలు చేస్తున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రాలు 'టైగర్ నాగేశ్వరరావు' అక్టోబరు 20న, 'ఈగిల్' జనవరిలో రిలీజ్ కానున్నాయి. అయితే ఈ చిత్రాల తర్వాత రవితేజ ఏ దర్శకుడితో సినిమా చేస్తారు? అనే చర్చ కొంతకాలంగా ఇండస్ట్రీలో వినిపిస్తోంది. గోపీచంద్ మలినేని, అనుదీప్ వంటి దర్శకుల పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే తాజాగా జీవీఆర్ వాసు చెప్పిన ఓ స్టోరీ లైన్‌కు రవితేజ ఇంప్రెస్ అయ్యారని, పూర్తి కథ విన్న తర్వాత ఈ ప్రాజెక్ట్‌పై తుది నిర్ణయం తీసుకుంటారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మించనుందనే ప్రచారం కూడా జరుగుతోంది. మరి.. జీవీఆర్ వాసు కథకి రవితేజ ఫైనల్ గ్రీన్ సిగ్నల్ ఇస్తారా? లేదా? వేచి చూడాలి.


వారికి కాజల్ ఓ ఉదాహరణ

– దర్శకుడు శేఖర్ కమ్ముల

''మగధీర' సినిమాలో మిత్రవిందగా కాజల్ ఎలా ఉన్నారో ఇప్పుడూ అలానే ఉన్నారు. పెళ్లి చేసుకున్న తర్వాత కూడా హీరోయిన్స్ వారి కెరీర్‌ను కొనసాగించవచ్చనడానికి కాజల్ ఓ ఉదాహరణగా నిలుస్తున్నారు. 'సత్యభామ' సినిమా గ్లింప్స్ బాగుంది.. టీమ్‌కు ఆల్ ది బెస్ట్'' అని దర్శకుడు శేఖర్ కమ్ముల అన్నారు. కాజల్ అగర్వాల్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'సత్యభామ'. అఖిల్ డేగల దర్శకత్వంలో అవురమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాస రావు తక్కలపెల్లి నిర్మిస్తున్నారు. నేడు (సోమవారం, జూన్ 19) కాజల్ బర్త్ డే. ఈ సందర్భంగా ఆదివారం 'సత్యభామ' సినిమా గ్లింప్స్‌ని శేఖర్ కమ్ముల విడుదల చేశారు. కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ– ''తెలుగుచిత్ర పరిశ్రమ నాకు ఇల్లులాంటిది. తెలుగు ఆడియన్స్ బెస్ట్. వారి ప్రేమ, ప్రోత్సాహం వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నా'' అన్నారు. ''నా తొలి సినిమాకు హీరోగా నిలిచిన కాజల్‌గారికి ధన్యవాదాలు'' అన్నారు అఖిల్ డేగల. ''మంచి చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తాం'' అన్నారు శ్రీనివాస్, బాబీ. ఈ కార్యక్రమంలో స్క్రీన్‌ప్లే, చిత్ర సమర్పకుడు శశికిరణ్ తిక్క, కథారచయితలు రమేష్, ప్రశాంత్, కెమెరామేన్ మోహిత్ కృష్ణ, క్రియేటివ్ ప్రొడ్యూసర్ రాజీవ్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.


శశికిరణ్, అఖిల్, శేఖర్ కమ్ముల, కాజల్, శ్రీనివాస రావు, బాబీ


నాన్‌స్టాప్‌గా నలభై రోజులు!


మహేశ్‌బాబు

'గుంటూరు కారం' సెట్స్‌లోకి మహేశ్‌బాబు మరోసారి అడుగుపెట్టడానికి ఇంకాస్త సమయం పట్టేలా ఉంది. మహేశ్ బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'గుంటూరు కారం'. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో పూజా హెగ్డే, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తున్నారు. కాగా ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ ఈ నెల రెండో వారంలో ప్రారంభం కావాల్సి ఉంది. కానీ జూలై మొదటి వారంలో ప్రారంభించాలని యూనిట్ భావిస్తోందని ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అలాగే జూలైలో ప్రారంభమయ్యే కొత్త షెడ్యూల్ చిత్రీకరణ నాన్‌స్టాప్‌గా దాదాపు 40రోజులకుపైగా జరుగుతుందనే టాక్ కూడా వినిపిస్తోంది. ఈ చిత్రాన్ని సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల చేయనున్నట్లు గతంలో మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

హారర్ సినిమాలు చేయకూడదనుకున్నా

– నందితా శ్వేత


అనూప్, నందితా శ్వేత, శంకర్, శంకర్ మార్తాండ్

''హారర్ చిత్రాల్లో నటించకూడదనుకున్నాను. కానీ 'ఓ మంచి ఘోస్ట్' సినిమా కథ నచ్చడంతో చేశాను. ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అని హీరోయిన్ నందితా శ్వేత అన్నారు. శంకర్ మార్తాండ్ దర్శకత్వంలో నందితా శ్వేత, 'వెన్నెల' కిశోర్, 'షకలక' శంకర్, నవమి గాయక్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. అభినిక ఐనాభాతుని నిర్మించారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'పాప నువ్వు తోపు..' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. సింహాచలం లిరిక్స్ అందించిన ఈ పాటను బాలసూరన్న పాడారు. ఈ పాట విడుదల వేడుకలో శంకర్ మార్తాండ్ మాట్లాడుతూ–''హారర్ అండ్ కామెడీ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. హారర్ కథలకు మ్యూజిక్ చాలా ముఖ్యం.. అనూప్‌గారు ప్రాణం పెట్టి ఈ సినిమాకు సంగీతం అందించారు'' అన్నారు. ''ఓ పాప నువ్వు తోపు..' పాట ఆకట్టుకుంటుంది'' అన్నారు అనూప్ రూబెన్స్.

మా నాన్న సూపర్ హీరో!


సుధీర్‌బాబు


'మా నాన్న సూపర్ హీరో' అంటున్నారు సుధీర్ బాబు. 'లూజర్' వెబ్‌సిరీస్ ఫేమ్ అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో సుధీర్‌బాబు హీరోగా రూపొందుతున్న చిత్రానికి 'మా నాన్న సూపర్ హీరో' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ మూవీలో ఆర్నా హీరోయిన్. సీఏఎం ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి వి సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై సునీల్ బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆదివారం (జూన్ 18) ఫాదర్స్ డే సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు మేకర్స్. ''తండ్రీకొడుకుల ప్రేమ, అనుబంధాలకు నిజమైన అర్థాన్ని తెలియజేసేలా 'మా నాన్న సూపర్ హీరో' ఉంటుంది. త్వరలోనే ఈ సినిమాను విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రంలో రాజు సుందరం ఓ కీలక పాత్రలో నటిస్తూనే, కొరియోగ్రాఫర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సాయిచంద్, సాయాజీ షిండే, శశాంక్, ఆమని, హర్షిత్ రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: జై క్రిష్, కెమెరా: సమీర్ కల్యాణి.

ఇదేం జీవితం?


రామకృష్ణ గౌడ్, సాయిప్రసన్న, శ్రీకాంత్

శ్రీకాంత్ గుర్రం, సాయిప్రసన్న జంటగా ఎస్ఎస్ శాన్నీ దర్శకత్వంలో 'ఇది ఏం జీవితం రా అయ్యా' సినిమా ప్రారంభమైంది. బొక్కిసం భూలక్ష్మి నిర్మిస్తున్నారు. హీరో హీరోయిన్లపై చిత్రీకరించిన తొలి సన్నివేశానికి నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ క్లాప్ ఇచ్చారు. ''మిడిల్ క్లాస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. రాజమండ్రి సమీపంలో షూటింగ్ జరుగుతుంది'' అన్నారు ఎస్ఎస్ శాన్నీ.

రాకేష్ మాస్టర్ ఇకలేరు



తెలుగు చలన చిత్రపరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖ నృత్య దర్శకుడు ఎస్.రామారావు అలియాస్ రాకేష్ మాస్టర్(53) ఆదివారం మృతిచెందారు. వారం క్రితం ఓ సినిమా షూటింగ్ కోసం విశాఖపట్నం, భీమవరం వెళ్లి వచ్చిన ఆయన అప్పటినుంచి అనారోగ్యం పాలయ్యారు. ఆదివారం రక్త విరోచనాలు కావడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి ప్రాంతంలో రాకేష్ మాస్టర్ జన్మించారు. ఆయన అసలు పేరు ఎస్.రామారావు. 10 ఏళ్ల వయస్సులో డిస్కో డాన్స్ చూసి డ్యాన్సర్‌గా మారాలనుకున్నారు. కానీ, ఎక్కడ నేర్చుకోవాలి? ఎవరు నేర్పుతారు? అని తెలియక టీవీలో వచ్చే పాటలను చూసి డ్యాన్స్ నేర్చుకున్నారు. ఆ తర్వాత తిరుపతి టౌన్‌కి వెళ్లి ఓ డ్యాన్స్ స్కూల్ ప్రారంభించారు. తొలిరోజుల్లో కేవలం రూ.5 ఫీజుతో డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చేవారు. కొన్ని రోజుల తర్వాత సినిమా అవకాశాల కోసం చెన్నై వెళ్లారు. చాన్స్‌లు రాకపోవడంతో మళ్లీ తిరుపతికి వచ్చి డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్‌ను నడిపారు. ఆ తర్వాత ముక్కు రాజు మాస్టర్ దగ్గర కొంతకాలం పనిచేశారు రాకేష్ మాస్టర్. 'ఆట', 'ఢీ' లాంటి డ్యాన్స్ రియాలిటీ షోల ద్వారా డ్యాన్స్ మాస్టర్‌గా కెరీర్‌ను మొదలు పెట్టారాయన. 'ఢీ' షోలో బషీర్ అనే కుర్రాడికి మాస్టర్‌గా వ్యవహరిస్తున్న సమయంలో ఆ షోకి ఓ జడ్జిగా వ్యవహరించిన ప్రముఖ డ్యాన్స్ మాస్టర్, నటుడు ప్రభుదేవాతో 'తెలుగు తెలిసిన వాళ్లే జడ్జిలుగా ఉండాలి' అంటూ కామెంట్స్ చేసి, వార్తల్లో నిలిచారు రాకేష్ మాస్టర్. వేణు తొట్టెంపూడి హీరోగా నటించిన 'చిరునవ్వుతో' లో 'నిన్నలా మొన్నలా లేదురా..' పాటతో సినిమాల్లో కొరియోగ్రాఫర్‌గా తొలి అవకాశం అందుకున్నారాయన. ఆ తర్వాత 'లాహిరి లాహిరి లాహిరిలో, దేవదాసు, సీతారామరాజు, యువరాజు, గర్ల్ ఫ్రెండ్, బడ్జెట్ పద్మనాభం, మనసిచ్చాను, సీతయ్య, అమ్మో పోలీసోళ్లు' వంటి దాదాపు 1500 చిత్రాలకుపైగా కొరియోగ్రఫీ చేశారు రాకేష్ మాస్టర్. 'గ్లోబల్ పీస్ యూనివర్సిటీ' నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారాయన. ప్రభాస్ వంటి పలువురు హీరోలకు డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చారు. టాలీవుడ్‌లోని పలువురు స్టార్ హీరోలందరికీ కొరియోగ్రఫీ చేసిన ఘనత ఆయన సొంతం. ప్రస్తుతం తెలుగులో అగ్ర కొరియోగ్రాఫర్లుగా ఉన్న శేఖర్ మాస్టర్, జానీ మాస్టర్ రాకేష్ మాస్టర్ శిష్యులే కావడం విశేషం. ఓ టీవీ చానల్‌లో ప్రసారం అవుతున్న షోలో పలు స్కిట్లు చేసి, బుల్లితెర ప్రేక్షకుల్ని తనదైన శైలిలో నవ్వించారు రాకేష్ మాస్టర్. కొంతకాలంగా ఆయన సినిమాలకు దూరంగా ఉన్నారు. అయితే సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండేవారు. యూట్యూబ్ చానల్స్ వేదికగా పలువురు సెలబ్రిటీలపై వివాదాస్పద ఇంటర్వ్యూలు ఇచ్చి ఇటీవల మళ్లీ ట్రెండ్ అయ్యారాయన. వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో వారి అభిమానుల నుంచి రాకేష్ మాస్టర్‌కి, ఆయన కుటుంబానికి బెదిరింపులు వచ్చేవి. ఈ కారణంగా ఆయన కుటుంబానికి దూరంగా అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఓ అనాథ ఆశ్రమంలో ఉంటూ వచ్చారు. ఆయనకు భార్య లక్ష్మి, కుమారుడు చరణ్‌తేజ్, కుమార్తె శ్రీజ ఉన్నారు. రాకేష్ మాస్టర్ మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు తమ సంతాపం తెలిపారు. కాగా హైదరాబాద్‌లోని బోరబండలో నేడు రాకేష్ మాస్టర్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తోనే..

''ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు రాకేష్ మాస్టర్‌ని గాంధీ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. డయాబెటిక్ పేషెంట్ కావడం, సివియర్ మెటబాలిక్ ఎసిడోసిస్ కావడంతో మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ అయి సాయంత్రం 5గంటలకు మృతి చెందారు'' అని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు మీడియాకు తెలిపారు.

సంక్రాంతికి జాతర


ప్రజ్వల్

కన్నడ నటుడు దేవరాజ్ పెద్ద కుమారుడు ప్రజ్వల్ దేవరాజ్ హీరోగా నటించనున్న చిత్రం 'జాతర'. ఉదయ్ నందనవనమ్ దర్శకత్వంలో వర్ధమాన్, లోటస్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై గోవర్ధన్ రెడ్డి నిర్మించనున్న ఈ సినిమా షూటింగ్ ఆగస్టులో ప్రారంభంకానుంది. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ–''జాతర'కి మంచి కథ కుదిరింది. ప్రజ్వల్‌కి స్క్రిప్ట్ నచ్చడంతో వెంటనే ఓకే చెప్పేశారు. బి. వాసుదేవ్ రెడ్డి కథకు ఉదయ్ నందనవనమ్ ఇచ్చిన ట్రీట్మెంట్, స్క్రీన్ ప్లే 'జాతర' స్క్రిప్ట్‌ను మరింత కొత్తగా మార్చాయి. హైదరాబాద్, బళ్లారి లొకేషన్స్‌లో చిత్రీకరణ జరుపుతాం'' అన్నారు. ''ఈ సినిమాలో ప్రేమ కథ ఎంత అందంగా ఉంటుందో, నేపథ్యం కూడా అంతే కొత్తగా ఉంటుంది. ప్రస్తుతం నటీనటుల ఎంపిక జరుగుతోంది. వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమా విడుదల చేస్తాం'' అన్నారు ఉదయ్ నందనవనమ్. పాన్ ఇండియా చిత్రంగా రూపొందనున్న ఈ మూవీకి సంగీతం: భీమ్స్ సిసిరోలియో.